కలెక్టర్ మేడమ్..

పాఠాలు బోధిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి, ఆగస్టు 22: కలెక్టర్ వల్లూరు క్రాంతి బడి పంతులుగా మారి విద్యార్థినులకు పాఠాలు బోధించారు. గురువారం కంది మండల పరిధిలోని కాశీపూర్ కేజీబీవీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠ్య పుస్తకాన్ని చేతబట్టి కాసేపు బోధించారు. ఉపకరణాలతో బోధిస్తే విద్యార్థి చదువుకున్న అంశాన్ని దీర్ఘకాలంపాటు జ్ఞాపకం ఉంచుకుంటారని చెప్పారు. విద్యార్థుల గ్రహణ శక్తిని పరిశీలించారు. డిజిటల్ బోధనతో ఎక్కువ విషయాలు నేర్చుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. విద్యార్థినులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని, పరసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. విద్యార్థినులకు ఆరోగ్య సమస్య తలెత్తితే వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చి వైద్యం అందించాలన్నారు.

నోటీసులు ఇవ్వకుండా సస్పెన్షన్ సరికాదు

డీఈవోకు వినతిపత్రం ఇస్తున్న వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు

సంగారెడ్డి కలెక్టరేట్, ఆగస్టు 22: ముందస్తు నోటీసులు ఇవ్వకుండా, వివరణ కోరకుండా ఉపాధ్యాయులపై సస్పెన్షన్ వేటు వేయడం సరికాదని ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో గురువారం విద్యాశాఖ అధికారి కార్యాలయంలో డీఈవో వెంకటేశ్వర్లుకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నచిన్న కారణాలను చూపుతూ సస్పెన్షన్‌కు గురి చేయొద్దని కోరారు. ఉపాధ్యాయులు ఎలాంటి పొరపాట్లు చేసినా నోటీసులు, మెమోలు జారీ చేయకుండా సస్పెన్షన్ చేయడం తగదన్నారు. ఉపాధ్యాయుల సంజాయిషీ స్వీకరించిన తర్వాతనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఇటీవల విధుల నుంచి తొలగించిన వారిని వెంటనే తిరిగి విధుల్లోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్, ఎస్టీయూటీఎస్, జీహెచ్‌ఎంఏ, ఏపీయూఎస్, పీఆర్టీయూటీఎస్, టీఎన్ఎస్ఎఫ్, ఎస్‌సీఎస్‌టీయూఎస్, యూటీఎఫ్‌టీఎస్ జిల్లా నాయకులు రాంచందర్, సయ్యద్ సాబేర్ అలీ, ప్రభాకర్, అడివయ్య, మదన్ గోపాల్, గైని బాలయ్య, దుర్గయ్య, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

షరతులు లేని రుణమాఫీ చేయాలి


గుమ్మడిదల: మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకుడు ఆదర్శ్‌రెడ్డి

సంగారెడ్డి: ధర్నాలో పాల్గొన్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, బీఆర్ఎస్ నాయకులు

- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆదర్శ్‌రెడ్డి
- కదం తొక్కిన బీఆర్ఎస్
- గుమ్మడిదలలో నియోజకవర్గ స్థాయి రైతు మహాధర్నా

గుమ్మడిదల, ఆగస్టు 22: రైతులందరికీ ఆంక్షలు లేని పంట రుణమాఫీ చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆదర్శ్‌రెడ్డి డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు పిలుపుమేరకు గుమ్మడిదల బస్‌స్టాండ్ ప్రాంగణంలో నియోజకవర్గ స్థాయి రైతు మహాధర్నా చేపట్టారు. కార్యక్రమంలో పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, మాజీ కార్పొరేటర్ అంజయ్యయాదవ్, మాజీ జడ్పీటీసీ కొలను బాల్‌రెడ్డి, తెల్లాపూర్ మాజీ సర్పంచ్ సోమిరెడ్డి, చిమ్ముల గోవర్దన్‌రెడ్డి, తెల్లాపూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ రాములుగౌడ్, కౌన్సిలర్లు నాగరాజు, బాబ్జీ, శ్రీశైలం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. సీఎం డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. పోలీసులు నిరసన వ్యక్తం చేస్తున్న వారిని విరమింపజేశారు. దీనికి ముందు రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించి నిరసన తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో వారు మాట్లాడుతూ రూ.2 లక్షల రుణమాఫీ అని చెప్పిన కాంగ్రెస్ అనేక కొర్రీలు పెట్టి 40 శాతం మంది రైతులకు పంట రుణమాఫీ కాకుండా చేసిందని, రైతులందరికీ రుణమాఫీ అందే వరకు బీఆర్ఎస్ పోరాటం ఆగదని స్పష్టం చేశారు.

మాఫీ కాకుంటే మా బతుకులు ఆగమే..

నాకున్న ఎకరన్నర పొలానికి నర్సాపూర్ బ్యాంకులో రూ.50 వేలు రుణం తీసుకున్న. మొదటి విడతనే రుణమాఫీ అయితదని అధికారులు చెప్పారు. మూడు విడతలైనా మాఫీ కాలే. నా భర్తకు రోగంవచ్చి చనిపోయిండు. నాకోడలు జాజుల యాదమ్మ పేరు మీద ఉన్న రుణం మాఫీ కాకపోవడంతో బాధ పడుతున్నాం. వ్యవసాయాధికారులు ఏమ్ చెప్త లేరు. రుణమాఫీ కాకపోతే మా బతుకులు ఆగమైతవి.

- జాజుల సత్తమ్మ, రైతు, నల్లవల్లి, గుమ్మడిదల మండలం

అన్నదాతల నడ్డి విరుస్తున్న కాంగ్రెస్

ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సంగారెడ్డి, ఆగస్టు 22: అడ్డగోలు ఆంక్షలు.. షరతులతో పూర్తిస్థాయిలో పంట రుణమాఫీ చేయకుండా ప్రభుత్వం అన్నదాతలను మోసం చేస్తున్నదని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఆరోపించారు. గురువారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గ కేంద్రాలతోపాటు తహసీల్ కార్యాలయాల ఎదుట బీఆర్ఎస్ నాయకులు రైతులు మహా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలుకాని హామీలిచ్చి రైతుల నడ్డి విరుస్తున్నదని మండిపడ్డారు. ఎలాంటి అంక్షలు లేకుండా పంట రుణాలన్నీ మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో డీసీసీబీ చైర్మన్ పట్నం మాణిక్యమ్, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ మంజు శ్రీజైపాల్‌రెడ్డి, సీడీసీ మాజీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, బీఆర్ఎస్ పట్టణ, మండల అధ్యక్ష, కార్యదర్శులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హత్నూర: ధర్నాలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు, రైతులు

గుమ్మడిదల: హైవేపై రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, రైతులు

రామచంద్రాపురం: అంబేద్కర్ విగ్రహానికి వినతి

స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తుల ఆహ్వానం

సంగారెడ్డి కలెక్టరేట్, ఆగస్టు 22: కేంద్ర ప్రభుత్వం, సామాజిక న్యాయం, దివ్యాంగుల సాధికారత శాఖ ద్వారా దివ్యాంగుల విద్యార్థుల కోసం ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్, టాప్ క్లాస్ ఉపకార వేతనాల పథకంలో భాగంగా నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్ ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని జిల్లా మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి లలితాకుమారి గురువారం ప్రకటనలో తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరానికి ఫ్రెష్, రెన్యువల్ కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. www.depwd.gov.in,http://scholarships.gov.in లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 9, 10 తరగతుల విద్యార్థులు ఈ నెల 31లోగా ప్రీ మెట్రిక్, 11, 12 తరగతుల విద్యార్థులు, పోస్ట్ మెట్రిక్, టాప్ క్లాస్ ఎడ్యుకేషన్ (డిగ్రీ, డిప్లొమా, పీజీ ఆపై కోర్సులు) విద్యార్థులు అక్టోబర్ 31లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

'పీఎం బాల పురస్కార్'కు దరఖాస్తుల ఆహ్వానం

సంగారెడ్డి కలెక్టరేట్, ఆగస్టు 22: ప్రధాన మంత్రి బాల పురస్కార్ అవార్డులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని జిల్లా మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి లలితాకుమారి గురువారం ప్రకటనలో తెలిపారు. 5 నుంచి 18 సంవత్సరాలలోపు వయస్సు గల ప్రతిభావంతులైన బాలలకు, పిల్లల రక్షణ కోసం కృషి చేస్తున్న స్వచ్ఛంద సంస్థలకు పీఎం బాల పురస్కార్ అవార్డులు అందిస్తామని పేర్కొన్నారు. అర్హులైన వారు ఈ నెల 31లోగా http://awards, gov.inలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

రామచంద్రాపురం, ఆగస్టు 22: అనుమానస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన కొల్లూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరాఖండ్‌కు చెందిన జల్విందర్‌సింగ్(32) గచ్చిబౌలిలోని ఓ హోటల్‌లో చెఫ్‌గా పనిచేస్తున్నాడు. అతని స్నేహితుడు అంజ్యోత్‌పాల్ తెల్లాపూర్‌లో రెంట్‌కు ఉంటున్నాడు. ఊరేళ్తున్నానని తన స్నేహితుడు జల్విందర్‌సింగ్‌కు చెప్పాడు. ఊరేళ్తున్నావు కదా వచ్చేంతవరకు ఇంట్లో ఉంటానని చెప్పడంతో సరేనన్నాడు. 18న జల్విందర్‌సింగ్ ఇంట్లోకి వెళ్లి ఆ తర్వాత ఇంటి నుంచి బయటకు రాలేదు. బుధవారం రాత్రి సమయంలో ఇంట్లో నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు 100కి కాల్ చేసి సమాచారం ఇచ్చారు. కొల్లూర్ ఎస్సై సురేశ్ ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్పీఎఫ్ అకాడమీలో వైద్య శిబిరం

అమీన్‌పూర్, ఆగస్టు 22: అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని బంధం కొమ్ములోని టీజీఎస్పీఎఫ్ అకాడమీలో గురువారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నగరంలోని మెడికవర్, మా ఈఎన్‌టీ, పార్థా డెంటల్, న్యూ రెటీనా కంటి దవాఖానల సహకారంతో ఎస్పీఎఫ్ సిబ్బంది, అధికారులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. డీఐజీ, ప్రిన్సిపల్ మాధవరావు, వైస్ ప్రిన్సిపల్ కృష్ణయ్య, ఇన్‌స్పెక్టర్లు రాజు, సత్తయ్య, శ్రీధర్‌గౌడ్ తదితరులున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్

'ప్రైవేట్'లో రిజర్వేషన్లు అమలు చేయాలి

సంగారెడ్డి, ఆగస్టు 22: స్వాతంత్ర్యం వచ్చి 78ఏండ్లు గడిచినా ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్ల అమలుకు ప్రభుత్వాలు చిత్తశుద్ధి కనబర్చడంలేదని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్ ఆరోపించారు. గురువారం పట్టణంలోని బాబానగర్ కళాశాల వసతిగృహంలో '78 ఏండ్ల భారత దేశ స్వాతంత్రం–ఎదురవుతున్న సవాళ్లు' అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాణిక్ మాట్లాడుతూ ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు లేకపోవడంతో మెజారిటీ ప్రజలకు సరైన విద్య, ఉపాధి అవకాశాలు అందడంలేదన్నారు. ప్రైవేట్ రంగంలోనూ రిజర్వేషన్లు అమలు చేస్తేనే సామాజిక న్యాయం జరుగుతుందన్నారు. ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్ల సాధనకు రాజ్యాంగ రక్షణకు ఐక్యంగా పోరాడాలన్నారు. దళితుల్లో ఒకరోఇద్దరో సంపన్నులైతే వారి రిజర్వేషన్లు రద్దు చేయాలంటూ చర్చించడం సరికాదన్నారు. కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి అశోక్, ఉపాధ్యక్షుడు శివకుమార్, సహాయ కార్యదర్శి దాసు మహేశ్, నాయకులు శ్రీనివాస్, బాలరాజ్ పాల్గొన్నారు.

తోళ్ల పరిశ్రమ స్థలాన్ని వెనక్కి తీసుకోవాలి

ఎంపీ రఘునందన్‌రావుకు వినతిపత్రం ఇస్తున్న శివనగర్ గ్రామస్తులు

జిన్నారం, ఆగస్టు 22: శివనగర్ శివారులో తోళ్ల పరిశ్రమ కోసం ఇచ్చిన స్థలంలో కార్ఖానాలకు బదులుగా ఇండ్ల నిర్మాణాలు చేపడుతున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు ఎంపీ రఘునందన్‌రావు, కలెక్టర్ వల్లూరు క్రాంతిని కోరారు. ఈ మేరకు గురువారం వినతిపత్రం అందజేశారు. తోళ్ల పరిశ్రమ ఏర్పాటు చేయని వారి నుంచి స్థలం వెనక్కి తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆధీనంలో ఉన్న 20 ఎకరాల్లో గ్రామస్తులకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని కోరా రు. కార్యక్రమంలో కమ్మరి కృష్ణ, ఆదిత్య, మహేశ్‌యాదవ్, సుధాకర్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మల్లన్న బస్తీలో యూజీడీ పనులకు శంకుస్థాపన చేస్తున్న చైర్‌పర్సన్ రోజాబాల్ రెడ్డి

బొల్లారం, ఆగస్టు 22: ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పిస్తున్నామని బొల్లారం మున్సిపల్ చైర్‌పర్సన్ కొలన్ రోజా బాల్ రెడ్డి అన్నారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డు ఐడీఏ బస్తీలోని మారుతి ధర్మకాంట వద్ద నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులకు రెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం 22వ వార్డు మల్లన్న బస్తీలో మున్సిపల్ సాధారణ నిధులతో నిర్మిస్తున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కార్యక్రమంలో కౌన్సిలర్లు రాధాపరశురాం, శ్రీకాంత్ యాదవ్, ఏఈ కిష్టయ్య, సిబ్బంది ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

కోల్‌కతా ఘటనపై కొవ్వొత్తుల ర్యాలీ

క్యాండిల్ ర్యాలీ నిర్వహిస్తున్న బ్యాంకు ఉద్యోగులు

సంగారెడ్డి, ఆగస్టు 22: కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటనను నిరసిస్తూ బ్యాంకు ఉద్యోగుల సంఘం నాయకులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. గురువారం పట్టణంలోని పోతిరెడ్డిపల్లి నుంచి కలెక్టరేట్ వరకు సాయంత్రం మృతి చెందిన వైద్యురాలి ఆత్మకు శాంతి కలగాలని ర్యాలీ చేశారు. కార్యక్రమంలో సంగారెడ్డి పట్టణ బ్యాంకు ఉద్యోగుల సమన్వయ కమిటీ అధ్యక్షుడు పవన్, కార్యదర్శి వెంకటేశ్, నాయకులు తేజశ్విని, ఆంజనేయులు, కవిత, హరీశ్, మహేశ్ పాల్గొన్నారు.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం

అవగాహన కల్పిస్తున్న కళాకారులు

అందోల్, ఆగస్టు 22: వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతో సీజనల్ వ్యాధులను నివారించవచ్చని ఎంపీడీవో రాజేశ్వర్ అన్నారు. గురువారం చింతకుంటలో తెలంగాణ సాంస్కృతిక సారధి కళాబృందం ఆధ్వర్యంలో వ్యాధుల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆట, పాటల రూపంలో దోమల విజృంభనతో వచ్చే వ్యాధులు, వ్యక్తిగత పరిశుభ్రతతో వాటి నివారణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీవో అశోక్, సిబ్బంది ఉన్నారు.

మత్తుకు దూరంగా ఉండాలి

సదాశివపేట, ఆగస్టు 22: మత్తు పదార్థాలు జీవితాన్ని అంధకారంలోకి పడేస్తాయని, యువత మత్తుకు దూరంగా ఉండాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ఎస్ రత్నప్రసాద్ అన్నారు. గురువారం కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో మత్తు పదార్థాల వినియోగం, యాంటీ ర్యాగింగ్ అంశంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాలు అమ్మడం, కొనడం, వినియోగించడం నేరమన్నారు. ర్యాగింగ్ నేరమని, చట్టపరంగా శిక్షార్హులవుతారని విద్యార్థులకు సూచించారు. అనంతరం విద్యార్థులు మత్తు పదార్థాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సిద్దులు, అధ్యాపకులు మురళీకృష్ణ, శరవయ్య, తారా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జగదీశ్వర్ పాల్గొన్నారు.

'గృహజ్యోతి'కి దరఖాస్తు చేసుకోవాలి

గుమ్మడిదల, ఆగస్టు 22: గృహజ్యోతి పథకంలో భాగంగా 200 యూనిట్ల ఉచిత విద్యుత్ లబ్ధి పొందని వారికోసం ప్రభుత్వం మరో అవకాశం కల్పించిందని ఎంపీడీవో ఉమాదేవి తెలిపారు. గురువారం మండల కేంద్రంలో ఆమె మాట్లాడుతూ ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నా గృహజ్యోతి రానివారు ప్రజాపాలన సైట్లో నమోదు కాలేని వారికి ఆన్‌లైన్‌లో ఎడిట్ చేసుకోవడానికి అవకాశం ఇచ్చిందని తెలిపారు. మండల ప్రజలు సంబంధిత కరెంట్ బిల్లు, ప్రజాపాలన దరఖాస్తు రశీదు, రేషన్‌కార్డు, ఆధార్ కార్డు, సెల్‌ఫోన్ నంబర్‌తో మండల పరిషత్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ఎట్టకేలకు బస్టాప్ ఏర్పాటు

జిన్నారం, ఆగస్టు 22: ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద బస్సులు ఆపాలని బుధవారం విద్యార్థులు చేసిన ఆందోళనకు ఆర్టీసీ అధికారులు స్పందించారు. జూనియర్ కళాశాల వద్ద బస్సులు నిలిపేందుకు హెచ్‌సీయూ, నర్సాపూర్‌కు చెందిన డిపో మేనేజర్లు గురువారం బస్టాప్ బోర్డును ఏర్పాటు చేశారు. కళాశాలతోపాటు పాఠశాలకు బస్సులో వచ్చి, వెళ్లే విద్యార్థులకు బస్టాప్ అందుబాటులోకి రావడంతో సంతోషం వ్యక్తం చేశారు. నడకబారం తప్పిందని, కళాశాలకు, పాఠశాలకు సమయానికి వస్తామని విద్యార్థులు తెలిపారు.

కాలుష్య కాటుకు మరో నాలుగు బర్రెలు మృతి

జిన్నారం, ఆగస్టు 22: గడ్డపోతారం పంచాయతీ కిష్టయ్యపల్లి గ్రామానికి చెందిన బశెట్టి సాయికుమార్, సంతోష్‌కుమార్‌కు చెందిన బర్రెలు కాలుష్య జలాలు తాగి మృత్యువాత పడుతున్నాయి. గురువారం మరో నాలుగు బర్రెలు మృతి చెందాయి. కాలుష్య జలాలు తాగిన బర్రెలు మృతి చెందడంతో మంగళవారం గడ్డపోతారం అయ్యమ్మ చెరువు కట్టమీద ఆందోళన చేసిన బాధితులు, గ్రామస్తులు బుధవారం సనత్‌నగర్‌లోని పీసీబీ కార్యాలయం ఎదుట మృతి చెందిన పశువులతో ఆందోళన చేసిన విషయం తెలిసిందే.. గురువారం సైతం మరో నాలుగు బర్రెలు మృతి చెందడంతో బాధిత కుటుంబం తీవ్ర ఆందోళనకు గురైంది. నాలుగు రోజుల్లో పన్నెండు బర్రెలు మృతి చెందాయి. మరో నాలుగు బర్రెలు అస్వస్థతకు గురయ్యాయి. పశువైద్యాధికారులు మూడు రోజులుగా పశువులకు చికిత్స అందిస్తున్నా దక్కడం లేదు. గురువారం జిల్లా నుంచి ప్రత్యేకంగా పశువైద్యాధికారులు హాజరయ్యారు. జిన్నారం పశువైద్యాధికారి విశ్వచైతన్య, జిల్లా అధికారులతో కలిసి చికిత్స చేసి సెలైన్ ఎక్కించినా నాలుగు పశువులు మృతి చెందాయి. ప్రమాదకరమైన రసాయన వ్యర్థాలు కలిసిన నీటిని తాగడంతోనే పశువులు మృతి చెందినట్లు పోస్టుమార్టం చేసిన అధికారులు తెలిపారు. మృతి చెందిన పశువుల్లో తొమ్మిది ఈనేందుకు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. మరిన్ని పశువులు కూడా ప్రాణాపాయ స్థితిలో ఉన్నాయని తెలిపారు. పశువులపైనే ఆధారపడి ఉన్నామని, బతికి ఉన్న పశువులను రక్షించి, చనిపోయిన వాటికి పరిహారం అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని బాధితులు బాశెట్టి సాయికుమార్, సంతోష్ కుమార్ వేడుకున్నారు.

సీపీఆర్‌తో గుండెపోటు నుంచి రక్షణ

ఇస్నాపూర్‌లో సీపీఆర్ నేర్పిస్తున్న డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

పటాన్‌చెరు, ఆగస్టు 22: సీపీఆర్‌తో గుండెపోటు నుంచి రక్షణ కల్పించవచ్చని పటాన్‌చెరు సర్కార్ దవాఖాన సుపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ చౌరస్తాలో ప్రముఖ సామజిక సేవకుడు ఖాదర్ మొహియుద్దీన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత సీపీఆర్ అవగాహన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడకు వచ్చిన ప్రజలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, కార్మికులు, బ్యాంక్ సిబ్బందికి సీపీఆర్ చేయడంపై శిక్షణ ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ సీపీఆర్ నేర్చుకోవాలన్నారు. అనంతరం ఖాదర్ మొహియుద్దీన్ మాట్లాడుతూ శారీరక వ్యాయామం లేకపోవడంతో యువత, మధ్యవయస్కులు కూడా గుండె పోటుకు గురై మరణిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి ఇంట్లో ఒకరిద్దరికైనా సీపీఆర్ వచ్చి ఉండాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు ఉపేందర్ ముదిరాజ్, గడ్డం శ్రీశైలం, ఎల్లకొండ మల్లారెడ్డి, బాలామణి, డాక్టర్ రాఘవేంద్రరెడ్డి, డాక్టర్ వెంకటస్వామి, డాక్టర్ సౌజన్య, డాక్టర్ కీర్తి చందన, డాక్టర్ నవీన్‌చౌదరి, డాక్టర్ సందీప్, డాక్టర్ క్రిష్టినా జాయిస్, డాక్టర్ సౌమ్య , కమలాకర్, షఫీ, ఫారూక్, ఫెరోజ్ పాల్గొన్నారు.

మొక్కల పెంపకంపై దృష్టి పెట్టాలి

అందోల్: మొక్కలు నాటుతున్న జడ్పీ సీఈవో జానకీరెడ్డి

అందోల్, ఆగస్టు 22: గ్రామాల్లో నాటిన మొక్కల పెంపకంపై పంచాయతీ కార్యదర్శులు దృష్టి పెట్టాలని జడ్పీ సీఈవో జానకీరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని సంగుపేట గ్రామంలో నర్సరీ, క్రీడా ప్రాంగణం, పల్లెప్రకృతి వనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాటిన మొక్కల సంరక్షణకు చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పిచ్చి మొక్కలను ఎప్పటికప్పుడు తొలిగిస్తూ పరిసరాల పరిశుభ్రంగా ఉంచాలని కార్యదర్శికి సూచించ్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేశ్వర్, ఎంపీవో అశోక్, పంచాయతీ కార్యదర్శి సాయిఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సామాజిక బాధ్యతగా మొక్కలు నాటాలి

వట్‌పల్లి, ఆగస్టు 22: ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యతగా మొక్కలు నాటాలని ఎంపీడీవో శశిప్రభ అన్నారు. గురువారం మండల కేంద్రంలో స్వచ్ఛదనం –పచ్చదనం కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులతో కలిసి మొక్కలు నాటారు. నాటిన ప్రతి మొక్కనూ బతికించుకోవాలన్నారు. ఆంగన్వాడీ టీచర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అమ్మ పేరుతో ఒక మొక్క

గుమ్మడిదల, ఆగస్టు 22: మండలంలోని బొంతపల్లి జడ్పీహెచ్ పాఠశాలలో ఎంపీడీవో ఉమాదేవి, హెచ్ఎం రాంబాబు ఆధ్వర్యంలో విద్యార్థులు అమ్మపేరుతో ఒక్కో మొక్కను నాటారు. నాటిన ప్రతిమొక్కనూ కాపాడాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనపూర్‌లో..

పటాన్‌చెరు, ఆగస్టు 22: 'నాటుదాం ఒక చెట్టు– అమ్మపేరు మీద' అనే నినాదంతో మండలంలోని ఘనపూర్ గ్రామంలో పంచాయితీరాజ్ శాఖ, గ్రామీణాభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో వన మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రంగారావు, ఎంపీడీవో యాదగిరి, ఎంపీవో హరిశంకర్ గౌడ్ మొక్కలు నాటారు. ఎంపీవో హరిశంకర్ గౌడ్, కార్యదర్శులు రాజలింగం, రాజేందర్, ప్రవీణ్, ఆర్ఐ ఖాజా పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించాలి

కోహీర్, ఆగస్టు 22: నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాలని పంచాయతీ కార్యదర్శి అమరేశ్వరి అన్నారు. మండలంలోని వెంకటాపూర్‌లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఈజీఎస్ ఎఫ్ఏ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ న్యాయవాదిగా ప్రభుదాన్యం

జిల్లా జడ్జి భవానిచంద్రకు పుష్పగుచ్ఛం ఇస్తున్న ప్రభుదాన్యం

సంగారెడ్డి, ఆగస్టు 22: జిల్లా కోర్టులో న్యాయవాదిగా విధులు నిర్వహిస్తున్న ప్రభుదాన్యం ప్రభుత్వ న్యాయవాదిగా నియామకమయ్యారు. గురువారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవానిచంద్రను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ప్రభుత్వ న్యాయవాదిగా అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా కోర్టు, అనుబంధ కోర్టుల్లో ప్రజల తరపున వాదనలు వినిపిస్తానని చెప్పారు.

నేడు ఫ్రీడమ్ వాక్

సంగారెడ్డి, ఆగస్టు 22: 'చేయి చేయి కలుపుదాం.. డ్రగ్స్ మహమ్మారిని తరిమికొడదాం' అనే నినాదంతో మాదక ద్రవ్యాలను సమూలంగా నేర్మూలించడమే లక్ష్యంగా పని చేస్తున్నారని ఎస్పీ రూపేశ్ గురువారం ప్రకటనలో తెలిపారు. డీఅడిక్షన్ క్యాంపెయిన్‌లో భాగంగా జిల్లా పోలీసు శాఖ, జిల్లా అడ్మినిస్ట్రేషన్ విభాగం, సహారా దవాఖానల సంయుక్త ఆధ్వర్యంలో 24 శుక్రవారం ఉదయం 7 గంటలకు కలెక్టరేట్ నుంచి జిల్లా కోర్టు వరకు ఫ్రీడం వాక్ నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు. జిల్లావాసులు, పట్టణ ప్రజలు, ఔత్సాహికులు, యువత అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

దోమల నివారణకు ఫాగింగ్

బొల్లారం, ఆగస్టు 22: బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో సీజనల్ వ్యాధులు రాకుండా మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఒకటో వార్డులో గురువారం ఉదయం కౌన్సిలర్ చంద్రయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు దోమల నివారణకు ఫాగింగ్ చేశారు. అనంతరం పరిసరాలను, ఇండ్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచిస్తూ అవగాహన ర్యాలీ చేపట్టారు.

PUBLIC NOTICE

This is to inform all the General Public that, 1) Sri M.Ilaiah, S/o. Komuraiah, Aged about 58 years, Resident of Plot No. 101, Chayameena Enclave, Kukatpally, Hyderabad (Herein after referred to as Vendor). He approached my client to sell his schedule of property client namely Sri Mohammed Yousuf (Cell: 9032456156), S/o. Mohd. Moulali, Aged about 41 years, Occ: Business, Resident of H.No. 7-77/106/2, Tailor Colony, Beeramguda, Ameenpur Mandal, Sanga Reddy District.

SCHEDULE OF PROPERTY

Property Plot No. 41 & 42 Block "D", admeasuring area each Plot 200 Sq.yds. or 167 Sq.mtrs. in Survey No. 163 as shown in the plan situated at Indresham Village & G.P., Patancheru Mandal, Sangareddy District, Telangana State and bounded as:

Plot No. 41

North: 30' Wide Road, South: Plot No. 60, East: Plot No. 42, West: 30' Wide Road.

Plot No. 42

North: 30' Wide Road, South: Plot No. 59, East: Plot No. 43, West: Plot No. 41.

Thereby my client auctions the General Public that, if anybody having any objection, claim, interest over the said property they may approach undersigned with all relevant papers within seven (7) days from the date of issuance of this publication, after that objection will not be entertained.

CH. SRINIVAS, Advocate
Beeramguda, Ameenpur,
Sangareddy Dist.,
Cell: 9912340012.